పకడ్బందీగా ప్రజాపాలన

సిద్దిపేట ఆర్డీఓ రమేష్ బాబు
- జిల్లావ్యాప్తంగా సన్నాహక కార్యక్రమాలు
- వంద కుటుంబాలకు ఒక కౌంటర్
- నేటి నుంచి జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన సభలను పకడ్బందీగా నిర్వహించాలని సిద్దిపేట ఆర్డీఓ రమేష్‌బాబు ఆదేశించారు. బుధవారం చిన్నకోడూరు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం నుంచి జనవరి 6 వరకు ప్రతి గ్రామ పంచాయతీలో సభ నిర్వహించి ఆరు గ్యారంటీల దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎస్‌ఐ సుభాష్‌గౌడ్, వివిధశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు: మాట్లాడుతున్న ఆర్డీఓ రమేష్‌బాబు



వర్గల్: మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

- **తొగుట(దుబ్బాక):** ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.
- **జగదేవ్‌పూర్(గజ్వేల్):** ప్రజాపాలనను జయప్రదం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం మండల కార్యాలయంలోని అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రజాపాలన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.
- **కొమురవెల్లి(సిద్దిపేట):** కొమురవెల్లి మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అధికారి శ్రీరాంరెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజాపాలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలోఎంపీపీ తలారి కీర్తన, జెడ్పీటీసీ సిద్దప్ప, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.
- **దుబ్బాక:** అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి ప్రజాపాలనను విజయవంతం చేయాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.
- **అక్కన్నపేట(హుస్నాబాద్):** మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రజాపాలనపై ఎంపీపీ మాలోతు లక్ష్మి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు.
- **వర్గల్(గజ్వేల్):** ప్రతి 100 కుటుంబాలకు ఒకటి చొప్పున కౌంటర్లు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాధికారి, వర్గల్ మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం వర్గల్ ఎంపీపీ లతా రమేష్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.
- **ములుగు(గజ్వేల్):** ములుగు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ సలీం, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఎస్‌ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- **మర్కూక్(గజ్వేల్):** ఆరు గ్యారంటీలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏపీడీ కౌసల్యాదేవి సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్ర యాదవ్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, ఎంపీడీఓ ప్రవీణ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.
- **సిద్దిపేటరూరల్:** ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.
- **హుస్నాబాద్:** మున్సిపల్ సమావేశ మందిరంలో పాలకవర్గ సభ్యులతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సమావేశం నిర్వహించారు. పట్టణంలో 7,053 కుటుంబాలకు 60 కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.
- **మిరుదొడ్డి(దుబ్బాక):** అధికారులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ గజ్జెల సాయిలు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
- **నంగునూరు(సిద్దిపేట):** ఆరు పథకాలతో పాటు ఇతర సమస్యల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామని మండల స్పెషలాఫీసర్ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. నంగునూరులో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.
- **బెజ్జంకి(సిద్దిపేట):** ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల సూచించారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.
- **మద్దూరు(హుస్నాబాద్):** ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి అన్నారు. బుధవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన గ్రామసభలపై వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలత మల్లేశం అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు.
- **గజ్వేల్‌రూరల్:** ప్రజాపాలన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మచ్చేందర్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఐవోసీలో ఎంపీపీ దాసరి అమరావతి, వైస్ ఎంపీపీ బెల్దె కృష్ణ, తహసీల్దార్ బాల్‌రాజు, గజ్వేల్ ప్రత్యేకాధికారి సునీత, సీఐ జాన్‌రెడ్డిలతో కలిసి సమావేశం నిర్వహించారు.
- **సిద్దిపేటఅర్బన్:** ప్రజాపాలన విజయవంతం చేయాలని ఎంపీడీఓ సమ్మిరెడ్డి ప్రజాప్రతినిధులకు, అధికారులకు సూచించారు.
- **సిద్దిపేటజోన్:** ప్రజాపాలన జయప్రదం కోసం సమష్టిగా పనిచేద్దామని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ దిలీప్ నాయక్ సూచించారు. బుధవారం విపంచి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు.
- **దౌల్తాబాద్(దుబ్బాక):** మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి, మండల స్పెషల్ అధికారి మల్లేశం, ఎంపీపీ గంగాధర్ సంధ్య, జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీఓ రాజేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.
- **హుస్నాబాద్‌రూరల్:** మండలంలోని పోతారం(ఎస్), మడద గ్రామాల్లో గురువారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి బుధవారం తెలిపారు.

క్లుప్తంగా

అయ్యప్ప దీవెనలు అందరిపై ఉండాలి



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: పట్టణంలోని సిద్దేశ్వరుడి గుట్టపై వెలిసిన అయ్యప్ప ఆలయంలో మంగళవారం రాత్రి మండలపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురుస్వామి వెంకటేష్ శర్మ ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి దీవెనలు నియోజకవర్గ ప్రజలపై ఉండాలన్నారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా భగవంతుడు సంకల్పం ఇవ్వాలని పొన్నం ఆకాంక్షించారు.

ప్రొటోకాల్ పాటించాలి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ కరుణాకర్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): ప్రజాపాలన ఫ్లెక్సీలో ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫొటో పెట్టాలని కోరుతూ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ ఏపీడీ ఓబులేష్‌కి వినతి పత్రం అందించారు. బుధవారం మండల పరిధిలోని ముస్త్యాలలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఎంపీపీ కరుణాకర్ మాట్లాడుతూ.. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వహించిన అధికారిక కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా ప్రొటోకాల్ నియమాలను పాటిస్తూ అందరి ఫొటోలు ఏర్పాటు చేసి గౌరవించామని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికారులతో కలిసి వార్డుల్లో పర్యటించాలని సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ కోరారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గురువారం నుంచి ప్రారంభమయ్యే ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులతో కలిసి భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మజార్ మాలిక్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్‌ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రశాద్, నజ్జు, అయూబ్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

'అధికారుల నిర్లక్ష్యం తగదు'

హుస్నాబాద్: రైతుల పట్ల విద్యుత్ అధికారులు అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరి తగదని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, రైతు సంఘం నాయకుడు అయిలేని శంకర్‌రెడ్డి అన్నారు. హుస్నాబాద్ ప్రాంతంలోని కొన్ని వ్యవసాయ బావులకు మాలపల్లె కరెంట్ ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేసేవారని తెలిపారు. రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మడద కరెంట్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా మార్చడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. రైతులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించిన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



కోతకు గురైన రోడ్డును మట్టితో నింపుతున్న దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని మర్రిచెట్టు సమీపంలో సుమారు రెండు, మూడు నెలల క్రితం భారీ వర్షానికి రోడ్డు కోతకు గురైంది. అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల విషయాన్ని సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం కోతకు గురైన రోడ్డును మట్టితో నింపి పూడ్చివేశారు. ప్రమాదాల నివారణకు కృషి చేసిన మంత్రి పొన్నంకు సర్పంచ్ సంజీవ్‌రెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుడాటిపల్లి సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, గౌరవెల్లి మాజీ ఎంపీటీసీ భైరగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజా పాలనను అందించడం కోసం అందరం ప్రజల వద్దకే వెళ్దామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా గురువారం నుంచి జనవరి 6 వరకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా అందరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గంప మహేందర్‌రావు, టీపీసీసీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు కలీమొద్దీన్, నాయకులు జీవన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరి, మల్లారెడ్డి, సీతాబాలు, చందు, శంకర్, ప్రతాప్, వంశీ, పవన్, సురేందర్, వాహబ్, అర్షద్, అజ్మత్, మున్నా పాల్గొన్నారు.

'రఘునందన్‌రావుపై విమర్శలు సరికావు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దుబ్బాకటౌన్: మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై బీఆర్‌ఎస్ నాయకులు బురదజల్లే మాటలు మానుకోవాలని బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మరాటి బాబు అన్నారు. బుధవారం దుబ్బాకలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ప్రచారం చేసిన వెంకటయ్యపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరితే ఎందుకు గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకులు రఘునందన్‌రావుపై అనవసరంగా విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో దళితమోర్చా జిల్లా నాయకులు రాజేష్, సంజీవులు, కనకరాజు, బుగ్గరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన నీరుడి ఉప్పలయ్య(46) ఈనెల 12వ తేదీన సొంత పనిపై మర్కూక్ మండలం భవానందపూర్‌కు బైక్‌పై వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని మామిడ్యాలకు రాత్రి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో క్షీరసాగర్– అనంతారం వెళ్లే రోడ్డులోని కల్వర్టు వద్దకు చేరుకోగానే రోడ్డు పక్కన ఉన్న వడ్ల కుప్పలను ఢీకొట్టి బైక్‌పై నుంచి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు చికిత్స కోసం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉప్పలయ్య ఈరోజు తెల్లవారుజామున మృతి చెందాడని చెప్పారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయండి



నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

హుస్నాబాద్: పట్టణంలో గ్రంథాలయం లేక నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. బుధవారం నిరుద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్ల క్రితం నిర్మించిన గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో మండల పరిషత్ ఆవరణలో రూ. 50 లక్షలతో గ్రంథాలయ నిర్మాణానికి స్థలం కేటాయించారని తెలిపారు. కాంట్రాక్టర్ నేటికీ నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు. దీంతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. వెంటనే శాశ్వత భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిరుద్యోగులు వినయ్, చంద్రశేఖర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ కోసం బారులు



జగదేవ్‌పూర్‌లో బారులు తీరిన ప్రజలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్యాస్ ఏజెన్సీల వద్ద జనం బారులు తీరుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నా.. గ్యాస్ ఏజెన్సీలు గ్రామాల్లోనే ఈ-కేవైసీ చేస్తామని చెబుతున్నా జనాలు మాత్రం కార్యాలయాల వద్ద పడిగాపులు గాస్తున్నారు. బుధవారం జగదేవ్‌పూర్‌లోని భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద ఉదయం నుంచి జనాలు బారులు తీరి కనిపించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

రాయపోల్(దుబ్బాక): బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్న సంఘటన మండలంలోని అనాజీపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన కదారి బాలలక్ష్మి తన 17 సంవత్సరాల కూతురి వివాహం జనవరి 3వ తేదీన జరిపించేందుకు నిశ్చయించింది. ఈమేరకు వివాహ ఏర్పాట్లు చేసుకుంటుండగా.. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్, పోలీస్, రెవెన్యూ అధికారులు బుధవారం ఆమె ఇంటికి వెళ్లారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను బాలికతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు వివరించారు. వివాహం జరిపించొద్దని, ఒకవేళ వివాహం చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పారు. దీంతో వారు వివాహాన్ని జరిపించబోమని అధికారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ దివ్య, ఎస్‌ఐ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



వివాహం చేయబోమని హామీ పత్రం అందజేస్తున్న కుటుంబీకులు

కారు, లారీ ఢీ: ముగ్గురికి గాయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): కారు, లారీ ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని అనంతసాగర్ వద్ద బుధవారం జరిగింది. కరీంనగర్‌కు చెందిన కోమల్ల విజయ్, అతడి మిత్రులు గుండ్ల వెంకటేశ్, నాగుల కిషోర్ కారులో హైదరాబాద్ వెళ్తుండగా.. అనంతసాగర్ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన లారీ ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో కారును ఢీకొంది. ఒక్కసారిగా జరిగిన ఘటనలో కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. అమెరికా– తెలుగు సంఘం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, అమెరికా– తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్‌రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్, ఐఎంఏ బాధ్యులు, ప్రజాప్రతినిధులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై ఫిర్యాదు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలో అనుమతి లేకుండా ప్రాక్టీస్ చేస్తున్న ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు వరుణ్, రాకేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని చాటాలి

మర్కూక్ (గజ్వేల్): గ్రామాల్లోని యువత క్రీడాస్ఫూర్తిని చాటాలని మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు సహేరా నరేష్ పేర్కొన్నారు. మండలంలో మర్కూక్ మండల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

బెజ్జంకి(సిద్దిపేట): అయప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం బెజ్జంకిలో అయ్యప్ప పడి పూజను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు టి.లింగంపల్లికి మంత్రి దామోదర రాక

రేగోడ్(మెదక్): మండలంలోని టి.లింగంపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం ప్రజాపాలన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నట్లు పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి బుధవారం తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: కామర్స్ సబ్జెక్టులో బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థులకు కామర్స్ సబ్జెక్టును బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 30న ఇంటర్వ్యూ, డెమో క్లాసుల ద్వారా ఎంపిక ఉంటుందని, అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రామవరం ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. సాయంత్రం అయితే చాలు మందుబాబులకు పాఠశాల అడ్డాగా మారిపోతోంది. వరస సెలవుల అనంతరం బడికి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు, ఆహార పదార్థాల వ్యర్థాలు, సిగరెట్ డబ్బాలు చూసి అవాక్కయ్యారు. గేటు సరిగా లేకపోవడంతో రోజూ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అలాగే గ్రామంలో అధిక సంఖ్యలో యువత గంజాయిను సిగరేట్‌లో పెట్టుకొని సేవిస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుని మందుబాబుల ఆగడాలను అరికట్టాలని గ్రామస్తులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు